సాక్షి
కాకినాడ
శుక్రవారం | 3 | జనవరి | 2025



గిఫ్ట్‌ల ఎర.. వెళ్తే బకరా

లాటరీలో బహుమతి గెలుచుకున్నారంటూ ఎర వేసి.. తమ ప్యాకేజీలకు డబ్బులు కట్టాలంటూ కొన్ని సంస్థలు ఒత్తిళ్లు తెస్తున్న ఉదంతాలు ఇటీవల పెరుగుతున్నాయి.


8లో



రోడ్డు ప్రమాదానికి ఇద్దరు బలి

గండేపల్లి మండలం మురారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరిని బలిగొంది. ఘటనా స్థలంలో ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు ప్రాణాలు విడిచారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 12,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 6,570 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

డాక్టర్ యనమదలకు మానవతా పురస్కారం



డాక్టర్ మురళీకృష్ణ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వివిధ రంగాల్లో నైపుణ్యం చూపుతూ, ప్రజాసేవలో నిమగ్నమైన వారికి మానవతా స్వచ్ఛంద సేవా సమితి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అవార్డులను ప్రకటించింది. ఇందులో కాకినాడకు చెందిన ప్రముఖ సాంక్రమిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ యనమదల మురళీకృష్ణను జాతీయ స్థాయి ఉత్తమ వైద్యుల కేటగిరీలో అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సమాచారాన్ని సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మునిని రామకృష్ణారావు గురువారం మురళీకృష్ణకు తెలియజేశారు. సేవా సమితి ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం అర్ధ శతాబ్ది కళా ఉత్సవాల సంబరాలు నిర్వహిస్తోంది. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే ఈ కళా ఉత్సవాలు, అవార్డుల ప్రదానోత్సవంలో డాక్టర్ మురళీకృష్ణకు ఈ పురస్కారం అందజేయనున్నారు. దీర్ఘకాలిక వ్యాధులపై అఖిల భారత స్థాయిలో పలు గ్రంథాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం, అంతర్జాతీయ స్థాయిలో అందరికంటే ముందుగా హెచ్‌ఐవీ నియంత్రణకు రెండు మందుల విధానాన్ని అమలు చేసిన తొలి వైద్యుడిగా గుర్తింపు పొందడం, దీర్ఘకాలిక వ్యాధులపై హెల్త్ జర్నల్స్‌లో రాసిన పరిశోధనాత్మక గ్రంథాలకు గాను ఆయనకు ఈ అవార్డు ప్రకటించారు.

9న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9న అమర్‌రాజా గ్రూప్ కంపెనీ ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులై, ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన వారు ఈ మేళాకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.21 వేల వేతనం చెల్లిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఆ రోజు ఉదయం 9 గంటలకు కళాశాలకు హాజరు కావాలని, వివరాలకు 86392 30775 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎస్‌ఎంసీల సహకారం అవసరం



శిక్షణలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కాకినాడ రూరల్: పాఠశాల నిర్వహణ, అభివృద్ధికి యాజమాన్య కమిటీల (ఎస్‌ఎంసీ) సహకారం ఎంతో అవసరమని, వీటి పాత్ర కూడా కీలకమైనదని సర్వశిక్షా అభియాన్ కాకినాడ సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. ఎస్‌ఎంసీల శిక్షణ కార్యక్రమాన్ని ఏపీఎస్‌పీ క్వార్టర్స్ జెడ్పీ హైస్కూలులో గురువారం నిర్వహించారు. ఎంఈఓ–1, 2లు వేణుగోపాల్, ఏసుదాసుల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎస్‌ఎంసీల విధులు బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారీ, సామాజిక తనిఖీ, పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ప్రధానోపాధ్యాయులకు ఎదురయ్యే సమకాలీన సమస్యల పరిష్కారం తదితర అంశాలపై జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్లు వివరిస్తారని అన్నారు. ప్రతి పాఠశాలకు ఒక కరదీపికను కూడా అందజేస్తామని చెప్పారు. ఎంఈఓలు మాట్లాడుతూ, కమిటీల భాగస్వామ్యం, ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని గాయత్రి, మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే శాఖకు భూములు అప్పగించాలి

అమలాపురం రూరల్: కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ అలైన్‌మెంట్ ప్రతిపాదనల ప్రకారం ఇప్పటికే సేకరించిన భూములను స్వాధీన పరుచుకుని రైల్వే శాఖకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం రెవెన్యూ అధికారులతో రైల్వే లైన్ అలైన్‌మెంట్ భూముల స్వాధీనం, అవార్డులు పాస్, భూ నష్టపరిహారాలు చెల్లింపు తదితర పెండింగ్ అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను అధిగమించే ప్రయత్నంతో పాటుగా భూముల సేకరణకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఇన్‌చార్జి డీఆర్‌ఓ కె.మాధవి, రెవెన్యూ డివిజనల్ అధికారులు డి.అఖిల పి.శ్రీకర్, ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, అయినవిల్లి తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీ ఏసుబాబు పాల్గొన్నారు.

ఇసుక దొంగలు



అక్రమార్కుల తవ్వకాలతో ఏలేరు కాలువలో ఏర్పడిన పెద్దపెద్ద గోతులు

ఏలేరు జలాలతో కిర్లంపూడి, ఏలేశ్వరం, పిఠాపురం, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి తదితర మండలాల పరిధిలో సుమారు 60 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగున్నరేళ్ల పాటు ఖరీఫ్, రబీ సీజన్లలో రెండు పంటలకూ పుష్కలంగా సాగు నీరందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి తలకిందులైంది. అధికార పార్టీ నేతల అండదండలతో బరితెగించిన ఇసుక మాఫియా.. ఏలేరు పరీవాహక ప్రాంతాలకు గుండె కోతను మిగులుస్తోంది. రబీ సాగును ప్రశ్నార్థకంగా మార్చేస్తోంది. 'పచ్చ' మాఫియా విచ్చలవిడిగా సాగిస్తున్న తవ్వకాలతో ఉన్న నీరు కూడా ఆయకట్టుకు సక్రమంగా అందని దుస్థితి ఏర్పడింది.

- కృష్ణవరంలో 'పచ్చ' మాఫియా
- ఏలేరుకు నిట్టనిలువునా తూట్లు
- 20 నుంచి 30 అడుగుల లోతుకు తవ్వకాలు
- ప్రతి నెలా రూ.4 కోట్ల పైనే అక్రమార్జన
- రెండో పంటకు నీరు ప్రశ్నార్థకం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఏలేరు కాలువలో దొంగలు పడ్డారు. ఒక రోజూ రెండు రోజులూ కాదు.. ఏకంగా రెండు మూడు నెలలుగా అధికార పార్టీ నేతల దన్నుతో బరితెగించేసి మరీ ఏలేరుకు తూట్లు పొడిచేస్తున్నారు. కాలువను 20 నుంచి 30 అడుగుల లోతున నిట్టనిలువునా తవ్వేసి, ఇసుక, మట్టి తెగనమ్ముకుంటూ లక్షల రూపాయలు దిగమింగేస్తున్నారు. సీనియర్ శాసన సభ్యుడు జ్యోతుల నెహ్రూ ప్రాతినిధ్యం వహిస్తున్న జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం కృష్ణవరం కేంద్రంగా ఈ వ్యవహారం నిరాటంకంగా సాగిపోతోంది. కృష్ణవరం **శివాలయం సమీపాన మట్టి, పాత కృష్ణవరం శ్మశా**నవాటిక ప్రాంతంలో ఇసుక అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. కృష్ణవరం వద్ద ఇసుక, మట్టి తవ్వకానికి రెండు ప్రాంతాల్లో 200 హార్స్‌పవర్ మెషీన్లు రెండేసి చొప్పున ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం నుండి తవ్వోడ (డ్రెడ్జింగ్ బోటు) రప్పించి మరీ పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుక, మట్టి కొల్లగొట్టేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలవుతున్న తవ్వకాలు మర్నాడు ఉదయం 8 గంటల వరకూ విరామం లేకుండా సాగుతున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఏలేరుకు ఇంతలా తూట్లు పొడిచేస్తున్నా.. కట్టడి చేయాల్సిన మూడు శాఖలు గాఢ నిద్రలో జోగుతూండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఏలేరు కాలువ మధ్యలో నుంచి పైపు ద్వారా అక్రమంగా ఇసుకను తోడేస్తున్న తవ్వోడ



తవ్వోడ నుంచి పైపు ద్వారా ఒడ్డున గుట్టగా వేస్తున్న ఇసుక

రూ.కోట్లలో లూటీ

ఏలేరు కాలువలో తవ్వుతున్న ఇసుక, మట్టిని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ప్రతి నిత్యం 40 నుంచి 50 లారీల్లో తరలించేసి, సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా తుని, అన్నవరం, కత్తిపూడి, ప్రత్తిపాడు, జగ్గంపేట, రాజానగరం, పెద్దాపురం, పిఠాపురం, కాకినాడ నగరాలకు ఇసుక తరలిస్తున్నారు. రాజమహేంద్రవరం, వేమగిరి, కడియం తదితర ప్రాంతాల్లో గోదావరి ఇసుక దొరకనప్పుడు ఏలేరు ఇసుకను లారీ కిరాయితో కలిపి రూ.1,3000 నుంచి రూ.14,000 వరకూ అమ్ముకుని సొమ్ము చేసుకునేవారు. ఇసుక దొరకడం మొదలయ్యాక ప్రస్తుతం రూ.10,000 నుంచి రూ.11,000 వరకూ వసూలు చేస్తున్నారు. ఒక్కో లారీ తక్కువలో తక్కువ మూడు ట్రిప్పులు వేస్తున్నాయి. ఇలా రోజుకు 120 నుంచి 150 ట్రిప్పుల ఇసుక, మట్టి తెగనమ్మేసి రూ.లక్షలు దిగమింగేస్తున్నారు. రోజుకు రూ.13.50 లక్షల చొప్పున నెలకు సుమారు రూ.4 కోట్ల వరకూ ఈ విధంగా మింగేస్తున్నారని అంచనా. ఇందులో పోలీసు, రెవెన్యూ, ఏలేరు ఇరిగేషన్ శాఖల పరిధిలోని వివిధ స్థాయిల్లో అందరికీ కలిపి రూ.20 లక్షల చొప్పున ముట్టజెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కృష్ణవరంలో టీడీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నేత కనుసన్నల్లో ఈ వ్యవహారం నడుస్తోంది. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే.. తన వెనుక ముఖ్య నేత ఉన్నారని, ఎవరికి చెప్పుకున్నా తమకు పోయేదేమీ లేదని ఆ ద్వితీయ శ్రేణి నేత బెదిరింపులకు దిగుతున్నారు.

రైతులు.. లబోదిబో..

విచ్చలవిడిగా ఇసుక, మట్టి తవ్వేస్తూండటంతో కృష్ణవరం వద్ద ఏలేరు కాలువ లోతుగా తయారైంది. దీంతో రెండో పంట సాగు నీటికి కటకటలాడాల్సి వస్తుందని ఆయకట్టు రైతులు లబోదిబోమంటున్నారు. కాలువకు ఒక పక్కన వేలంక, గెద్దనాపల్లి, పెద్దనాపల్లి, మరోవైపు కృష్ణవరం, పాత కృష్ణవరం, సోమరాయణంపేట, తామరాడ, గోనేడ, రామచంద్రపురం తదితర ప్రాంతాల్లోని 6 వేల ఎకరాల్లో రెండో పంటకు సాగునీరు అందడం గగనమైపోతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. వరదల సమయంలో ఏలేరు ఊళ్లకు ఊళ్లను ముంచెత్తి, ఏడెనిమిది వేల మంది ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందనే భయం స్థానికులను వెంటాడుతోంది. వాస్తవానికి డిసెంబర్‌లో వచ్చే సుబ్రహ్మణ్య షష్ఠి నాటికే ఏలేరు ఆయకట్టు రైతులు దమ్ములు చేసుకునే పరిస్థితి ఉండేది. కృష్ణవరం వద్ద సాగుతున్న అక్రమ తవ్వకాలతో నీరు అందక.. ఆయకట్టు ప్రాంతాల్లో ఇప్పటి వరకూ దమ్ములు పూర్తి కాలేదు. సొంతంగా బోర్లు ఉన్న రైతులు అక్కడక్కడ వ్యవసాయ పనులు చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఏలేరు కాలువలో తవ్వకాలను కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

గండ్లు పడే ప్రమాదం



ఏలేరు కాలువ నుంచి అక్రమంగా ఇసుకను తరలించడంతో వరదలు వచ్చినప్పుడు గట్లకు గండ్లు పడే ప్రమాదముంది. వరద నీటితో పంట పొలాలు మునిగిపోతాయి. కాలువలో పెద్ద పెద్ద గోతులు తవ్వడంతో దిగువ పంట పొలాలకు తరచూ సాగునీటి ఎద్దటి ఏర్పడి, రబీ సాగు ప్రశ్నార్థకంగా మారుతుంది. దీనిపై ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్, సిబ్బంది దృష్టి సారించాలి. అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలి.

– అల్లు శివరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు, గోనేడ, కిర్లంపూడి మండలం

ఇసుక భారీగా తరలిపోతోంది



శృంగరాయునిపాలెం బెడ్ రెగ్యులేటర్ సమీపంలో అక్రమంగా ఇసుక తవ్వి పెద్దపెద్ద లారీలు, ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నారు. ముఖ్యంగా పడవలపై తీసుకుని వచ్చిన ఇసుక వెలికితీత యంత్రాలతో పెద్దపెద్ద గోతులు పెడుతున్నారు. దీంతో పంటల సాగుకు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నాం. పగలు, రాత్రి అనే తేడా లేకుండా గ్రామంలో నుంచి ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తున్నాయి. దీంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోననే భయాందోళనకు గురవుతున్నాం.

– గరగా పెద్దకాపు, మాజీ మార్కెట్ డైరెక్టర్, శృంగరాయునిపాలెం, కిర్లంపూడి మండలం

చర్యలు తీసుకుంటాం



ఏలేరు కాలువలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు నా దృష్టికి వచ్చింది. సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి, ఎక్కడెక్కడ ఇసుక తవ్వుతున్నారో పరిశీలించేలా చర్యలు తీసుకుంటాం. స్థానికంగా వీఆర్‌ఓ లేకపోవడంతో కొంత ఇబ్బంది ఉంది. ఈ తవ్వకాలపై విచారణ చేపట్టి బాధితులపై చర్యలు తీసుకుంటాం.

– జె.చిరంజీవి, తహసీల్దార్, కిర్లంపూడి

సైన్స్ సంబరానికి వేళాయె..

- నేడు జిల్లా స్థాయి సైన్స్ పోటీలు
- సాలిపేట బాలికోన్నత పాఠశాలలో 126 ప్రాజెక్టుల ప్రదర్శన



గత ఏడాది జాతీయ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించిన ప్రాజెక్టు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించే లక్ష్యంతో ఏటా నిర్వహిస్తున్న సైన్స్ సంబరాలు శుక్రవారం కాకినాడలో జరగనున్నాయి. పాఠశాల విద్యా శాఖ, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రీ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం (బెంగళూరు) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన–2025కు స్థానిక సాలిపేట బాలికోన్నత పాఠశాల వేదికగా నిలవనుంది. మండల స్థాయిలో గత నెల 30, 31 తేదీల్లో ఈ పోటీలు నిర్వహించగా.. వ్యక్తిగత విభాగం నుంచి 42, ప్రాజెక్టుల గ్రూపు నుంచి 42, ఉపాధ్యాయుల విభాగం నుంచి 42 కలిపి మొత్తం 126 ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ప్రతి గ్రూపు నుంచి రెండు ప్రాజెక్టులను ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు పంపిస్తారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ఈ ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు.

మూడు కేటగిరీల్లో..

ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు మూడు కేటగిరీల్లో ఎనిమిది అంశాలపై నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల ప్రదర్శన (ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే), విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శన (ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడు), విద్యార్థుల గ్రూప్ (ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు) విభాగాల్లో పోటీలు ఉంటాయి. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం, భూమి, అంతరిక్ష శాస్త్రం, పర్యావరణ శాస్త్రం, ఇంజినీరింగ్, జీవ రసాయన శాస్త్రం, కంప్యూటర్ శాస్త్రం, జీవశాస్త్రం అంశాలపై ప్రాజెక్టులు ఉంటాయి.

మేధోసంపత్తికి పదును..



విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయి. మండల స్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రాజెక్టులతో ఆయా విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ప్రదర్శనలో పాల్గొంటారు. విద్యార్థుల్లో మేధోసంపత్తికి పదును పెట్టేందుకు ఉపకరించే ఈ ప్రదర్శనల్లో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు చైతన్యపరచాలి. విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, కొత్త ఆలోచనలకు రూపకల్పన చేయాలి.

– పిల్లి రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి, కాకినాడ

రత్నగిరిపై డిజిటల్ పేమెంట్ల కౌంటర్

- సత్యదేవుని సన్నిధిలో పశ్చిమ రాజగోపురం వద్ద ప్రారంభం
- ఇప్పటికే ప్రయోగాత్మకంగా పీఆర్‌ఓ ఆఫీసులో విక్రయాలు
- ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే, క్రెడిట్, డెబిట్ కార్డులతో సేవా టిక్కెట్ల విక్రయాలు



డిజిటల్ పేమెంట్ ద్వారా భక్తుడికి వ్రతం టికెట్టు అందజేస్తున్న దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో డిజిటల్ పేమెంట్ల కౌంటర్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం వద్ద ఉన్న వ్రతాలు, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల కౌంటర్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ కౌంటర్ ను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.సుబ్బారావు ప్రారంభించారు. మొదటిగా భక్తుడు, స్థానిక వ్యాపారి వీర్ల రాంబాబు రూ.2 వేల వ్రతం టికెట్టును డిజిటల్ పేమెంట్ ద్వారా కొనుగోలు చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కౌంటర్‌లో ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే, క్రెడిట్, డెబిట్ కార్డులతో సత్యదేవుని వ్రతం, దర్శనం, లక్ష్మీ ప్రయుక్త ఆయుష్య హోమం, ప్రత్యంగిర హోమం (అడ్వాన్స్) టికెట్లు కొనుగోలు చేశారు. ఉదయం 10 గంటలకు ఈ కౌంటర్‌ను ప్రారంభించగా.. చాలా మంది భక్తులు నగదు కన్నా డిజిటల్ పద్ధతిలో టికెట్లు కొనుగోలు చేయడానికి ఉత్సాహం చూపించారని అధికారులు తెలిపారు. మూడు రోజుల క్రితం నుంచే పీఆర్‌ఓ కార్యాలయంలోని కౌంటర్‌లో డిజిటల్ పేమెంట్ల ద్వారా ప్రయోగాత్మకంగా టికెట్లు విక్రయిస్తున్నారు. అయితే అధికారికంగా ఈ రోజు నుంచే డిజిటల్ పేమెంట్ల ద్వారా టికెట్ల విక్రయాలు అమలులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

తొలి రోజు రూ.97,708 ఆదాయం

డిజిటల్ పేమెంట్ల కౌంటర్ ద్వారా దేవస్థానానికి తొలి రోజు రూ.97,708 ఆదాయం వచ్చింది. సత్యదేవుని వ్రతం రూ.300 టిక్కెట్లు 34, రూ.1,000 టికెట్లు 12, రూ.1,500 టికెట్లు 16, లక్ష్మీ ప్రయుక్త ఆయుష్య హోమం ఆన్‌లైన్‌లో రూ.1,116 చొప్పున రెండు, స్వయంగా ఆచరించేందుకు రూ.1,000 చొప్పున మూడు టిక్కెట్లు భక్తులు కొనుగోలు చేశారు. అలాగే, ఆన్‌లైన్ వ్రతానికి రూ.1,116 చొప్పున ఎనిమిది టికెట్లు, రూ.2 వేల వ్రతం టికెట్లు రూ.17, వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం (అడ్వాన్స్) టికెట్లు రూ.1,116 చొప్పున మూడు టికెట్లను భక్తులు కొనుగోలు చేశారు. డిజిటల్ పేమెంట్ల ద్వారా టిక్కెట్ల కొనుగోలుకు భక్తులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని అధికారులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పశ్చిమ రాజగోపురం వద్ద డిజిటల్ కౌంటర్ పని చేస్తుందన్నారు. రామాలయం ఎదురుగా పీఆర్‌ఓ కార్యాలయం వద్ద ఉన్న కౌంటర్ రాత్రి 9 గంటల వరకూ పని చేస్తుందని తెలిపారు.

'సాక్షి' కథనాలతో కదలిక

దేవస్థానంలో డిజిటల్ పేమెంట్లు లేక భక్తులు ఇబ్బంది పడుతున్న అంశాన్ని గతంలో 'సాక్షి' దినపత్రిక అనేకసార్లు తన కథనాల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. గత నెల 26న 'రొక్కమే దిక్కు', గత ఏడాది జనవరి 21న 'నోటుపాట్లు' శీర్షికన కథనాలు ప్రచురించింది. వీటి ద్వారా డిజిటల్ పేమెంట్లు లేక సత్యదేవుని సన్నిధిలో భక్తులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. దీంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఎట్టకేలకు రత్నగిరిపై డిజిటల్ పేమెంట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీనిపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో ప్రసాద విక్రయాలు కూడా..

త్వరలో ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలను కూడా డిజిటల్ పేమెంట్ల ద్వారా జరపనున్నారు. ఈ మేరకు రెండు మూడు రోజుల్లో సాఫ్ట్‌వేర్ రూపొందించనున్నామని అధికారులు తెలిపారు.

నా సీటు మార్చారో.. మీ అంతు తేలుస్తా..

- జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ వీరంగం
- సూపరింటెండెంట్, డిప్యూటీ కలెక్టర్లకు బెదిరింపు
- సూపరింటెండెంట్ ముఖం పైకి పత్రాలు విసిరికొట్టిన వైనం
- కలెక్టర్ సీరియస్.. పోలీసులకు ఫిర్యాదు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఓ జూనియర్ అసిస్టెంట్ (గుమస్తా) వీరంగం సృష్టించడం కలకలం రేపింది. వివరాలివీ.. జీజీహెచ్ జనరల్ సెక్షన్–1లో మెడికల్ రీ యింబర్స్‌మెంట్ సీటు గుమస్తాగా డీఎస్ఎల్ఎన్ మూర్తి అలియాస్ సాయి పదేళ్లుగా కొనసాగుతున్నాడు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో అతడి సీటును మారుస్తూ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సుమారు రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకున్నారు. దీనికి ఎంత మాత్రం అంగీకరించేది లేదని డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ వద్దకు వెళ్లి అప్పట్లోనే సాయి గొడవ పడ్డాడు. దీనిపై ఆయన సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఆ సీటు వదిలేది లేదని సాయి రెండు నెలలుగా భీష్మించుకు కూర్చున్నాడు. పాలనా పరమైన మార్పుల్లో భాగంగా సాయితో కలిపి మరో నలుగురికి సూపరింటెండెంట్ గత నెల 31న ఉత్తర్వులు జారీ చేశారు. సాయి తప్ప మిగిలిన నలుగురూ బదిలీ అయిన సీట్లకు వెళ్లారు. సాయి రెండోసారి కూడా సీటు మార్చడానికి ఒప్పుకోలేదు. ఇదిలా ఉండగా.. కొద్ది రోజుల్లో జరగనున్న ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశానికి సంబంధించి తన చాంబర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి.. అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, ఏడీ అనురాధ, ఏఓ శర్మ సహా మరికొందరితో గురువారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సాయి ఒక్క ఉదుటన తలుపు నెట్టుకొని సూపరింటెండెంట్ చాంబర్‌లోకి ప్రవేశించాడు. తన సీటు మార్పు ఉత్తర్వులను అధికారులందరి ముందు సూపరింటెండెంట్ ముఖాన విసిరి కొట్టాడు. దుర్భాషలాడుతూ 'నా సీటు మార్చారో.. మీ అంతు చూస్తా'నంటూ డిప్యూటీ కలెక్టర్, సూపరింటెండెంట్‌లను హెచ్చరించాడు. దీనిపై కలెక్టర్ షణ్మోహన్‌కు డాక్టర్ లావణ్య కుమారి ఫిర్యాదు చేశారు. పలువురు ఉద్యోగ సంఘ నేతలు ఆమెకు సంఘీభావం తెలిపారు. సాయి ప్రవర్తనను తప్పుబట్టారు. అయితే, ఈ ఘటనపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఆయన ఆదేశాల మేరకు శ్రీధర్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు జీజీహెచ్‌కు వచ్చి సాయిని విచారించారు. సాయి పదేళ్లుగా ఇదే సీటులో కొనసాగుతున్నాడని ఆసుపత్రి అధికారులు తెలిపారు. ఈ సీటు పరిధిలో మెడికల్ రీయింబర్స్‌మెంట్, సదరం సర్టిఫికెట్లు, మెడికల్ ఇన్వాలిడేషన్ సహా కీలక కార్యకలాపాలన్నీ జరుగుతాయన్నారు. వీటిలో భారీ అవినీతి, లంచాల నేపథ్యంలో ఫిర్యాదులు అందడంతో పాటు పాలనాపరమైన మార్పుల్లో భాగంగా సీటు మార్పునకు సూపరింటెండెంట్ ఆదేశాలిచ్చారని తెలిపారు. ఆ ఆదేశాలను మిగిలిన వారు పాటించినా.. సాయి అభ్యంతరకరంగా వ్యవహరించాడని తెలిపారు. ఇదిలా ఉండగా.. ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్ ఆధ్వర్యాన పలువురు నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, సాయికి స్టేషన్ బెయిల్ ఇప్పించారు.

అంతర్వేది ఉత్సవాల షెడ్యూల్

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఫిబ్రవరి 4 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించనున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల షెడ్యూల్‌ను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ గురువారం విడుదల చేశారు. 4వ తేదీ రథసప్తమి. సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం. అదే రోజు స్వామివారిని పెండ్లికుమారుడిని, అమ్మవారిని పెండ్లికుమార్తెను చేయడం (ముద్రికాలంకరణ). 5వ తేదీ గరుడ పుష్పక, పుష్పక వాహనాలపై.. 6న హంస, శేష వాహనాలపై గ్రామోత్సవాలు. సాయంత్రం ధ్వజారోహణ. 7వ తేదీ పంచముఖాంజనేయస్వామి, కంచుగరుడ వాహనాలపై గ్రామోత్సవాలు, రాత్రి 12.55 గంటలకు స్వామివారి తిరు కల్యాణం. 8వ తేదీ మధ్యాహ్నం రథోత్సవం. 9న గజ, పొన్న వాహనాలపై గ్రామోత్సవాలు, రాత్రి అన్నపర్వత మహానివేదన. 10న హనుమద్, సింహ వాహనాలపై గ్రామోత్సవాలు. సాయంత్రం సదస్యం. 11న రాజాధిరాజా, అశ్వ వాహనాలపై గ్రామోత్సవాలు. 16 స్తంభాల మండపం వద్ద చోరసంవాద ఘట్టం. 12న చక్రవారీ స్నానం.. 13 రాత్రి తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

దొరకని మత్స్యకారుడి ఆచూకీ



నదిలో గల్లంతైన వీర కనకరాజు కోసం పడవపై గాలిస్తున్న మత్స్యకారులు

పి.గన్నవరం: మండలంలోని కె.ఏనుగుపల్లి గ్రామం వద్ద వైనతేయ నదిలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుడు శేరు వీరకన కరాజు (41) ఆచూకీ గురువారం సాయంత్రా నికి లభ్యం కాలేదు. స్థానిక మత్స్యకారులు ఐదు పడవలపై నదిలో గాలిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం నదిలో చెట్టు మోడుకు చిక్కుకున్న అయిలు వలను తప్పించే క్రమంలో వీరకనకరాజు నీట మునిగి గల్లంతైన విషయం విదితమే. అతడి కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు నుంచి జారిపడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

తుని: తుని–గుల్లిపాడు మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పాయకరావుపేట ఇంది రాకాలనీ సమీపంలో విశాఖపట్నం వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి 21 ఏళ్ల యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎరుపురంగు ఫుల్ చేతుల చొక్కా, సిమెంట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదని, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

గిఫ్ట్‌ల ఎర.. వెళ్తే బకరా



గిఫ్ట్‌ల కోసం వచ్చిన వారికి పూర్తి చేయమని ఇస్తున్న కంపెనీ ప్యాకేజీ ఓచర్

- లాటరీలో బహుమతి తగిలిందంటూ జంటలకు ఆహ్వానం
- వెళ్లాక వారి ప్యాకేజీలు కట్టమని ఒత్తిడి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మహేష్‌కు (పేరు మార్చాం) ఫోన్ వచ్చింది. మా కంపెనీ లాటరీలో మీరు బహుమతి గెలుచుకున్నారు. మీకు కంగ్రాట్స్ అంటూ అందమైన గొంతుతో ఓ యువతి నుంచి ఫోన్. దీంతో మహేష్‌కు ఆసక్తి పెరిగింది. నాకు వచ్చిన బహుమతి ఏ కంపెనీ, ఏంటీ అని ప్రశ్నించాడు. మీరు రాజమహేంద్రవరంలోని మా సంస్థ కార్యాలయానికి వస్తే ఆ బహుమతి తీసుకోవచ్చు. కానీ ఒక షరతు. మీరు ఒంటరిగా రాకూడదు. మీ భార్యతో రావాలని చెప్పారు. ఎప్పుడు రావాలో, ఎక్కడికి రావాలో అడ్రస్ చెప్పి ఆమె ఫోన్ పెట్టేసింది. మర్నాడు పనిమానుకుని బహుమతి వచ్చిందనే ఆశతో తన భార్యతో కలసి చెప్పిన అడ్రస్‌కు వెళ్లాడు. అక్కడ అంతా కోలాహలంగా ఉంది. మహేష్‌లానే చాలా మంది దంపతులు అక్కడకు వచ్చారు. అక్కడ రిసెప్షన్ కౌంటర్‌లో సంప్రదించగా, అక్కడ ఒక వ్యక్తిని పిలిచి వారిని అప్పగించి, ఒక టేబుల్ కేటాయించారు.

ఇలా మొదలైంది అసలు కథ..

తన భార్య పక్కన పరువు పోతుందోమోనని మహేష్ ఇబ్బంది పడ్డాడు. మీరు ఏం చేస్తారు, ఎక్కడ ఉంటారు వంటి వివరాలు నమోదు చేశారు. తనకు టూర్ ప్యాకేజీ కట్టేంత స్థాయి, ఉద్యోగం తనది కాదని చెప్పాడు. అయినా సరే వదలకుండా ఎంతో కొంత కట్టమని బలవంతం చేశారు. మోహమాట పెట్టారు. మహేష్ తమను ఎవరైనా గమనిస్తున్నారేమోనని చుట్టుపక్కల చూశాడు. కొందరు తమవైపు చూడడం గమనించాడు. వారు చెప్పినట్టుగా ముందుగా కొంత సొమ్ము కట్టి భార్య ముందు పరువు దక్కించుకున్నాడు. ఈ తతంగం అయిన తర్వాత టీం లీడర్‌గా వ్యవహరించిన వ్యక్తి చిరు ఉపన్యాసం చేశాడు. మన హాలీడే ట్రిప్ టూర్



గిఫ్ట్‌లు వచ్చాయంటూ ప్రజలను మభ్యపెట్టి రప్పిస్తున్న కార్యాలయం

టీమ్‌లోకి కొత్తగా ఒక జంటగా చేరానని వారిని అభినందించి, కపుల్ పిక్ తీసి దానిని ఆ కంపెనీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతరం వారి చేతిలో బాక్స్ గిఫ్ట్‌ను పెట్టారు. దానిని అక్కడ తెరిచి చూస్తే బాగుండదని మహేష్ ఇంటికి చేరుకున్న తర్వాత పిల్లల సమక్షంలో ఆ బహుమతి ప్యాకింగ్‌ను తెరిచాడు. అందులోంచి రెండు ప్లాస్టిక్ కప్‌లు దర్శనమిచ్చాయి. వాటి విలువ రూ.50 లోపే కావడంతో తన ఆశ అడియాస అయ్యింది.

అందరి పరిస్థితీ ఇదే..

ఆ కార్యాలయానికి వచ్చిన జంటల అందరి పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఘటికులైతే అక్కడి నుంచి తప్పించుకుని రావొచ్చేమోగాని మోహమాటస్తులు మాత్రం జేబులకు చిల్లు చేసుకోవడం తప్పదు. బహుమతులు వస్తున్నాయన్న ఆశతో ఒకరోజు సెలవు పెట్టుకుని వెళ్లిన మహేష్‌కు అక్కడ సమయం వృథా కావడంతో పాటు, రోజు వారీ జీతం పోవడంతో పాటు, అదనంగా ప్యాకేజీకి కట్టిన సొమ్ముతో జేబుకి చిల్లుపడింది. ఇటువంటి వ్యాపార సంస్థలు నగరంలో ఇటీవల కాలంలో ప్రత్యక్షమవుతున్నాయి. షాపింగ్ మాల్స్ వద్ద, ఇతర మార్గాల్లో సెల్‌ఫోన్ వినియోగదారుల నంబర్లను సేకరిస్తున్నారు. అందంగా మాట్లాడే టెలీకాలర్లను నియమించుకుని వారితో ఆ నంబర్లకు ఫోన్లు చేయించి, జనాలను బకారాలు చేస్తున్నారు. వీరి ఇచ్చే గిఫ్ట్ భారీగా ఉంటుందని భ్రమపెట్టి వీరి కార్యాలయానికి వచ్చే వినియోగదారులకు పదే పదే ఫోన్‌లు చేస్తున్నారు. త్వరగా రండి అని తొందర పెడుతున్నారు. ఇలా ధవళేశ్వరం నుంచి వస్తున్న ఒక మహిళ ఎక్కడ బహుమతులు మిస్ అయిపోతానేమోనని వస్తుండగా, ఆమె ప్రమాదానికి గురై చేయి విరుగొట్టుకున్న సంఘటన ఇటీవల చోటుచేసుకుంది.

బహుమతులకు ఆశ పడొద్దు

నిత్యం ఇటువంటి ఫోన్ కాల్స్ ఎదుర్కొనే వారు చాలామంది ఉంటారు. కొందరు కార్యాలయానికి వెళ్లలేకపోవచ్చు. మరికొందరు బహుమతులు వస్తాయనే ఆశతో వెళ్లి తమకు అవసరం లేకపోయినా వారు చెప్పిన ప్యాకేజీ నగదు చెల్లించి మోసపోతున్నారు. వినియోగదారులు ఒక విషయం గమనించాలి. ఏ సంస్థ లాభాపేక్ష లేకుండా వ్యాపారం చేయదని, ఉచితంగా బహుమతులు ఇవ్వదని గ్రహించాలి. అలా గ్రహించకపోతే ఇబ్బంది పడడం ఖాయం.

ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం



ఏదైనా సంస్థకు సంబంధించి ప్యాకేజీలను వినియోగదారులు పూర్తి ఇష్టపూర్వకంగా కట్టాలే తప్ప, వినియోగదారుడిని ఒత్తిడి చేయకూడదు. ప్రజలు ఇటువంటి ఫోన్ కాల్స్‌ని నమ్మవద్దు. బహుమతుల ఎరలో సమయాన్ని వృథా చేసుకోవద్దు.

– బాజీలాల్, సీఐ, ప్రకాశ్‌నగర్, రాజమహేంద్రవరం

మూడు గిఫ్ట్‌లు వచ్చాయని..



మా ఫోన్ నంబర్‌కు మూడు గిఫ్ట్‌లు వచ్చాయని, మా ఆఫీస్‌కు వచ్చి తీసుకెళ్లమని ఫోన్ వచ్చింది. పని మానుకుని నేను, నా భార్య వెళ్లాం. తీరా అక్కడ వారి కంపెనీ ప్యాకేజీలు కట్టమని ఒత్తిడి చేశారు. మేము వద్దన్నాం. మా చేతిలో చిన్న ప్లాస్టిక్ కప్‌ల బాక్స్‌ను పెట్టి పంపేశారు. పనులు మానుకుని వెళ్లి ఎవరూ ఈ విధంగా మోసపోవద్దు.

– చంద్రశేఖర్, వెంకటేశ్వరనగర్, రాజమహేంద్రవరం

రోడ్డు ప్రమాదానికి ఇద్దరు బలి

- ఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరు మృతి
- మృతులిద్దరూ సమీప బంధువులు

గండేపల్లి: హైవేలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరి పొట్టన పెట్టుకుంది. ఘటనా స్థలంలో ఒకరు మృతి చెందగా చికిత్స పొందుతూ మరొకరు ప్రాణాలు విడిచారు. గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు, స్థానికుల వివరాల మేరకు రాజమహేంద్రవరంలో మోరంపూడికి చెందిన లింగం సంతోష్‌కుమార్ (20), లింగం నవీన్ చంద్ (21) బుధవారం మోటార్ సైకిల్‌పై తమ స్నేహితుడిని దింపేందుకు తుని వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మండలంలోని మురారిలో లైబ్రేరీకి ఎదురుగా ఉన్న యూ టర్నింగ్ వద్దకు వచ్చేసరికి మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో రోడ్డుకు మధ్యలో గల గ్రిల్స్‌ను బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో యువకులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. నవీన్‌చంద్ అక్కడికక్కడే మృతిచెందగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న సంతోష్‌కుమార్‌ను హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. అర్ధరాత్రి వేళ మంచు కారణంగా రహదారి కనిపించకపోవడం, మోటార్ సైకిల్ వేగం కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా విశాఖ వైపునకు వెళ్లే మార్గంలోకి దూసుకుపోయి రోడ్డుపై పడింది. మృతులిద్దరూ వరసకు అన్నదమ్ములవుతారని, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్టు ఎస్సై శివ నాగబాబు పేర్కొన్నారు.



ఘటనా స్థలంలో మోటార్ సైకిల్



నవీన్ చందు, సంతోష్ కుమార్ (ఫైల్)

మోరంపూడిలో విషాద ఛాయలు

రాజమహేంద్రవరం రూరల్: చేతికి అందివస్తారనుకున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో మోరంపూడిలోని నివసిస్తున్న ఆ రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. నూతన సంవత్సరం రోజున ఇంటి వద్ద ఉంటారనుకున్న ఇద్దరు యువకులు స్నేహితుడైన సమీప బంధువును అతని స్వగ్రామంలో వదిలి తిరిగి వస్తుండగా మృత్యువాత పడడంతో వారి ఆవేదనకు అవధులు లేకుండా పోయాయి. సంతోష్‌కుమార్ ఇంటర్ పూర్తిచేసి కుటుంబానికి ఆసరాగా తండ్రి రత్నరాజు తో కలిసి తాపీ పనికి వెళ్తుండగా.. నవీన్‌చంద్ సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. నవీన్‌చంద్ తండ్రి వెంకటరమణ ఐదేళ్ల క్రితం విద్యుత్ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. అప్పటి నుంచి తల్లి వరలక్ష్మి సోదరుల సహకారంతో ఇద్దరు కుమారులను చదివిస్తున్నారు. కొద్దిరోజుల్లో మంచి ఉద్యోగం చేసి కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న తరుణంలో మృత్యువాత పడడాన్ని తల్లి, కుటుంబ సభ్యులు, జీర్ణించుకోలేకపోతున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పిల్లలు బయటకు వెళ్లారు వస్తారనుకుంటున్న తరుణంలో మృత్యువార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని రత్నరాజు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులకు కంటితడి పెట్టించింది.

తప్పిన ముప్పే

- తిరగబడ్డ గ్యాస్ సిలిండర్ల లారీ
- మృత్యుంజయుడిగా లారీ కింద పడ్డ వ్యక్తి

కంబాలచెరువు: గ్యాస్ సిలిండర్ల లారీ తిరగబడిన ఘటనలో ఒక వాహనదారుడు గాయాలపాలయ్యాడు. అయితే ఆ లారీలో ఖాళీ గ్యాస్ సిలిండర్లు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. లాలాచెరువు నుంచి క్వారీ వెళ్లే దారిలో డివైడర్‌ను ఢీకొట్టి అదుపు తప్పి తిరగబడింది. ఈ ప్రమాదంలో లారీ వెనుక ద్విచక్ర వాహనంపై వస్తున్న ఆటోనగర్‌లో వెల్డింగ్ వర్క్ చేసే శ్రీమన్నారాయణ లారీ కింద ఇరుక్కున్నాడు. లారీలో గ్యాస్ సిలిండర్ల లోడు ఉండడంతో స్థానికులు బెంబేలెత్తారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అయితే అవి ఖాళీ గ్యాస్ సిలిండర్‌లు అని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో లారీ మధ్యలో ఇరుకున్న శ్రీమన్నారాయణను క్రేన్ సహాయంతో లారీని లేపి బయటకు లాగారు. అతని కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. అతనిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. శ్రీమన్నారాయణ మృత్యుంజయుడిగా బయటపడడంతో అక్కడ సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదాలకు నిలయం

ఆ రహదారిలో సరైన వెలుతురు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో మూడు ప్రమాదాలు జరిగాయి. అయినా అధికారులు తీసుకున్న చర్యలు శూన్యం. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా డివైడర్‌లు కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లు అంటించకపోవడం, నివారణ చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. క్వారీ నుంచి లాలాచెరువు హైవేకి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం ఆ దారి గుండా వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. నాలుగు రోడ్ల జంక్షన్ ప్రమాదాలకు నెలవుగా మారుతున్నా కనీసం రబ్బరు స్పీడ్ బ్రేకర్లను కూడా అక్కడ ఏర్పాటు చేయడం లేదు.



తిరగబడ్డ గ్యాస్ ఖాళీ సిలిండర్ల లారీ



లారీ కింద ఇరుక్కున్న శ్రీమన్నారాయణను బయటకు లాగుతున్న దృశ్యం

దూసుకెళ్లిన కారు కేసులో పురోగతి

కిర్లంపూడి: పోలీసులను కారుతో ఢీకొట్టి పరారైన వ్యక్తుల కేసులో పోలీసులు పురోగతి సాధించినట్టు తెలిసింది. విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న వాహనంలో గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు వచ్చిన సమాచారంతో గత మంగళవారం అర్ధరాత్రి జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, స్థానిక ఎస్సై జి.సతీష్ తమ సిబ్బందితో కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న కారును అడ్డుకున్నారు. దీంతో కారును పక్కన పార్క్ చేస్తానని చెప్పి ఒక్కసారిగా ఎదురుగా ఉన్న కానిస్టేబుల్స్ లోవరాజును, హెడ్‌కానిస్టేబుల్ నాగరాజును ఢీకొట్టి వేగంగా వెళ్లిపోయారు. దీంతో పోలీసులు టోల్‌గేట్‌లోని సీసీ పుటేజీ ఆధారాలతో గురువారం పరారీలో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనంలో తరలిస్తున్న గంజాయినీ, వాహనాన్ని సీజ్ చేసినట్టు సమాచారం. కాగా వారిపై కేసులు నమోదు చేసి శుక్రవారం అధికారికంగా వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సామర్లకోట: స్థానిక రైల్వే గేటు వద్ద సుమారు 50 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని రైల్వే పోలీసులు గురువారం గుర్తించారు. రై లు నుంచి జారి పడి మృతి చెందాడా, పట్టాలు దాటు తూ మృతి చెందాడా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రైలు పట్టాలపై విధులు నిర్వహిస్తున్న గ్యాంగ్ సభ్యుల సమాచారం మేరకు ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గిరి సమాచారంతో జీఆర్‌పీ సిబ్బంది ఘటనా ప్రదేశానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల కోసం జీఆర్పీ ఎ స్సై లోవరాజును సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

మూడు మృతదేహాలకు పోస్టుమార్టం

కాకినాడ రూరల్: సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో గల్లంతైన ఇంటర్ విద్యార్థి బొర్రా శ్రీనుబాబు(17) మృతదేహం గురువారం ఉదయం గుర్తించారు. గల్లంతైన ప్రాంతానికి సమీపంలోనే మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో తిమ్మాపురం పోలీసులు కాకినాడ జీజీహెచ్‌కు పోస్టుమార్టం కోసం తరలించారు. న్యూ ఇయర్ సందర్భంగా బుధవారం స్నేహితులతో బీచ్‌కు వచ్చిన ముగ్గురు గల్లంతవ్వగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయిన సంగతి విదితమే. మృతులు గుత్తుర్తి సతీష్‌కుమార్, వడిసెల గౌరీ లక్ష్మి నాగ సాయి, బొర్రా శ్రీనుబాబు మృతదేహాలకు జీజీహెచ్‌లో గురువారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం వ్యాపారిని మోసగించిన వ్యక్తి అరెస్టు

చాగల్లు: ధాన్యం వ్యాపారిని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం చాగల్లు మండలం చంద్రవరం గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి గారపాటి సత్తిబాబు వద్ద నుంచి నాలుగు లోడులు ధాన్యంను కొవ్వూరు పట్టణానికి చెందిన దుద్దుపూడి సూరిబాబు కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ము ఇవ్వకుండా సూరిబాబు పరారయ్యాడు. సత్తిబాబు చాగల్లు పోలీసులను ఆశ్రయించడంతో సూరిబాబును గురువారం అరెస్టు చేసినట్టు ఎస్సై తెలిపారు. రైతులు, మధ్యవర్తుల వద్ద ధాన్యం, మొక్కజొన్న, నూకలు వంటివి కొంటానని చెప్పి సొమ్ము చెల్లించకుండా సూరిబాబు చాలామందిని మోసం చేశాడని అన్నారు. అతనిపై కొవ్వూరు, కొవ్వూరు రూరల్, సీతానగరం, గోకవరం, జంగారెడ్డిగూడెం, ఐ.పోలవరం, పెదన, వీరఘట్టం, తదితర పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా ఉన్నాయని తెలిపారు.

విద్యుత్ ఈఈ కార్యాలయంలో హైవోల్టేజ్

నిడదవోలు : స్థానిక బ్రాహ్మణగూడెం రోడ్డులో ఉన్న నిడదవోలు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో గురువారం హైవోల్టేజ్ విద్యుత్ సరఫరా కావడంతో కంప్యూటర్లు, ఫ్యాన్లు ధ్వంసమయ్యాయి. కార్యాలయం సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ కట్ అయ్యి మరో ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో ఒక్కసారిగా విద్యుత్ ఈఈ కార్యాలయానికి హైవోల్టేజ్ విద్యుత్ సరఫరా అయ్యింది. ఈ ఘటనతో ఈఈ కార్యాలయంలో పెద్ద శబ్దాలతో కంప్యూటర్లు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు పేలిపోయాయి. దీంతో సుమారు గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అధికారులు, విద్యుత్ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. అధికారులు తిరిగి జంపర్‌ను సరిచేయడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒకరికి మూడు రోజులు, ఆరుగురికి రెండురోజుల చొప్పున జైలు శిక్ష, పది మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

మినుము సాగు ఇలా...

పెరవలి: రబీ పంటగా మినుము వేసే రైతులు విత్తన ఎంపిక నుంచి సాగు ఎలా చేయాలనే దానిపై అవగాహన పెంచుకుంటే ఎంతో లాభదాయకంగా ఉంటుందని కొవ్వూరు వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) పి. చంద్రశేఖర్ తెలిపారు. విత్తన శుద్ధి చేయకపోవడం, యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం, విషపూరితమైన పురుగుమందులు అధిక మొత్తంలో వినియోగించడం వల్ల తెగుళ్లు ఆశిస్తాయని ఆయన తెలిపారు. ఈ పంటపై ముఖ్యంగా ఎల్లోమొజాయిక్ తెగులు, మారుకా మచ్చల పురుగు తెగులు, బూడిద తెగులు, అక్షింతల పురుగులు వంటివి ఆశిస్తాయని చెప్పారు. జిల్లాలో రబీ పంటగా మినుము సుమారు 900 హెక్టార్లలో సాగు చేస్తారని, ఇందులో నిడదవోలు నియోజకవర్గంలో 300 ఎకరాల్లో సాగు చేస్తుండగా పెరవలి మండలంలో తీపర్రు, కానూరు, కానూరు అగ్రహారం, నడిపల్లి, కాకరపర్రు గ్రామాల్లో 180 ఎకరాల్లో మినప పంట సాగు చేస్తున్నారని చెప్పారు. రబీ పంటగా మెట్ట ప్రాంతాల్లో వేసే రైతులు వరిని రెండు మూడురోజుల్లో కోస్తారనగా విత్తనాలు చల్లుతారు. భూమిలో ఉన్న తేమ ఆసరాగా మొక్కలు రావటంతో పాటు పైరు పెరిగి దిగుబడి ఇస్తాయి.



కాకరపర్రులో మినప చేలు

విత్తన ఎంపిక

రబీ పంటకు విత్తనాలు ఎంపిక చాలా కీలకం ఎందుకంటే తెగుళ్లను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకుంటే దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. తెగుళ్ల బెడద ఉండదు. ఎల్‌బీజీ–402(ప్రభవ) ఎల్‌బీజీ–611, పీబీజీ–107, ఎల్‌బీజీ–22 , టి–9 వీటిని ఎంపిక చేసుకుని వేసుకోవాలి.


యాజమాన్య పద్ధతులు

మెట్ట ప్రాంతాల్లో నీరు నిలుపుకోగలిగి, మురుగునీరు పోయే వసతి గల భూములు ఈ పంటకు అనుకూలం. భూమిని బాగా దుక్కిదున్ని విత్తడానికి ముందు ఎకరానికి 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం ఎరువులు వేసి బాగా కలియదున్నాలి.

విత్తన శుద్ధి

ఈ పంట వేసే ప్రతీ రైతు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. అలా చేయని చేలు తెగుళ్ల బారిన పడతాయి. కిలో విత్తనానికి ఇమిడా 70శాతం, ఇమిడాక్లోప్రిడ్ 34 శాతం మందును 2 మిల్లీలీటర్లు తీసుకుని ఒక మట్టి కుండలో వేసి విత్తనాలను బాగా కలపాలి. విత్తనాలను బయటకు తీసి నీడలో ఆరబెట్టాలి. విత్తే ముందు విత్తనాలకు క్యాప్టాన్ 3 గ్రాములు లేదా థైరామ్ 3 గ్రాములు పొడి మందును విత్తనాలకు బాగా కలిపి ఆ తరువాత విత్తుకోవాలి. ఇలా చేయడం వలన మొలక వచ్చిన 20రోజుల వరకు రసంపీల్చే పురుగులు పంటను ఆశించకుండా ఉంటాయి.

పాడి–పంట



నీటి యాజమాన్యం

నీటితడులు తేలికగా ఇవ్వాలి. విత్తిన 35రోజుల లోపు ఒక సారి, 55 రోజులకు మరోసారి ఇస్తే సరిపోతుంది.

ఎల్లో మొజాయిక్ తెగులు

మినప పంటపై అత్యంత ప్రమాదకరమైనది ఎల్లోమొజాయిక్ తెగులు. ఈ తెగులు తెల్లదోమ వల్ల వ్యాపిస్తుంది. ఇది వైరస్ కారకమైన తెగులు. ఇది సోకిన మొక్కలను చేల నుంచి వెంటనే పీకి కాల్చివేయడం కానీ లేదా గోతిలో కప్పెట్టడం కానీ చేయాలి. ఇది ఒక మొక్క నుంచి మరో మొక్కకు సులభంగా వ్యాపిస్తుంది. ఈ తెగులును టీ9, ఎల్‌బీజీ 752, పీ31 రకాలు తట్టుకుంటాయి.



పి.చంద్రశేఖర్, వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ), కొవ్వూరు

అక్షింతల పురుగులు

ఈ పురుగులు మినప పంటపై ఆశించినప్పుడు మొక్కల ఆకులను తినివేస్తాయి. దీని వలన పంటకు నష్టమేమీ ఉండదు.

బూడిద తెగులు

మినప పంటపై బూడిద తెగులు పూత, కాయ దశలో ఆశిస్తుంది. ఈ తెగులు సోకితే ఆకులపై బూడిద చల్లినట్లుగా ఒక రకమైన పదార్థం ఏర్పడుతుంది.

మారుకా మచ్చల పురుగులు

ఈ పురుగులు పంటపై ఆశించినప్పుడు ఆకులలో ఉండే పత్ర హరితాన్ని గోకి తినివేస్తాయి. ఆకులను మడతపెట్టి, పూతను కూడా మడతపెట్టి తినివేస్తాయి. ఈ పురుగులు పంటను ఆశిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుంది.